ప్రజాశక్తి
బుధవారం 30 అక్టోబర్ 2024
5
పార్వతీపురం మన్యం

15న జన జాతీయ గౌరవ్ దివస్

ప్రజాశక్తి - పార్వతీపురం

భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా నవంబర్ 15న జన జాతీయ గౌరవ్ దివస్‌గా మెగా ఈవెంట్ నిర్వహించనున్నట్టు ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో ఐటిడిఎ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎం జన్ మాన్ లబ్ధిదారుల వివరాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జన్‌మాన్ కార్యక్రమంలో భాగంగా గుర్తించిన అవసరమైన మౌలిక వసతులు కల్పన వివరాలు సమర్పించాలని అన్నారు. గృహ నిర్మాణం, రహదారులు, తాగునీరు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన ఆదేశించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పండగ వాతావరణంలో
మెగా టీచర్స్ పేరెంట్స్ మీట్ : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నవంబర్ 14న మెగా టీచర్స్ పేరెంట్స్ సమావేశం నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఎంఇఒలను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో విద్యాశాఖ ప్రగతిపై మండల విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు, విద్యార్థుల ప్రవేశం నుంచి కార్యక్రమం ముగిసే వరకూ సందడిగా ఉండాలన్నారు. పాఠశాల అభివృద్ధి, విద్యా నాణ్యత ప్రమాణాలు, పోషకాహారం తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల ఆలోచనలను పంచుకోవాలని తెలిపారు. పిల్లలకు, తల్లిదండ్రులకు రంగవల్లికలు, టగ్ ఆఫ్ వార్, చిత్రలేఖనం పోటీలను నిర్వహించాలని సూచించారు. పాఠశాలలోని వసతి సౌకర్యాలు, విద్యా నాణ్యత ప్రమాణాలు, మన బడి - మన తోట, మై స్కూల్ - మై ఫ్రెండ్ వంటి అంశాలపై - అవగాహన కల్పిస్తూ సమావేశానికి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రతి పాఠశాలలో జరిగిన కార్యక్రమాలపై ఫొటోలను, వీడియోను తీసి తమకు పంపాలని, అందులో ఉత్తమ పాఠశాలకు అవార్డును ప్రకటిస్తామని కలెక్టర్ చెప్పారు.

గిరిజన ప్రాంతంలోని పాఠశాలలకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా విధులకు హాజరవ్వాలని, అత్యవసర పరిస్థితిల్లో సెలవుపై వెళ్లాల్సి వస్తే ఎంఇఒ అనుమతి తప్పనిసరి అని తేల్చి చెప్పారు. అలాగే విద్యార్థులంతా హాజరయ్యే చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని పేర్కొన్నారు. ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్య పెరగాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఈ ఏడాదీ జిల్లా తొలిస్థానంలో నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

పిఎం శ్రీ పథకం కింద ఇచ్చిన లక్ష్యాలను సాధించాలని, ఇందులో కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను తూ.చ పాటించాలన్నారు. పిఎం శ్రీ పథకం, బడి బయట పిల్లలను బడిలో చేర్పించుటకు ఒక్కో అధికారిని నియమించాలని డిఇఒ ఆదేశించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పాఠశాలకు పిఎం శ్రీ అవార్డు కూడా లభిస్తుందని కలెక్టర్ వివరించారు. ఈ పథకానికి ఇచ్చే నిధులను దుర్వినియోగం చేస్తే, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అపార్, యుడైస్ ప్లస్ నమోదు త్వరగా చేయాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. పుట్టిన తేదీ మినహా మిగిలిన అన్ని వివరాలు పాఠశాల నుంచే సరిచేసుకోవచ్చని, అవకాశం లేనివారు ఆధార్ నమోదు సెంటరుకు వెళ్లి చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డిఇఒ తిరుపతి నాయుడు, విద్యాశాఖ ఎడి ఎంఇ రమాజ్యోతి, ఎంఇఒలు పాల్గొన్నారు.

'ఉపాధి' సెగలు

ప్రజాశక్తి - పార్వతీపురం/బలిజిపేట

మా ద్వారా పనులు జరగాలి : సర్పంచులు
ఎమ్మెల్యే సాక్షిగా కుదరదన్న టిడిపి నాయకులు
సమావేశంలోకి చొరబడి దౌర్జన్యం
బాయ్ కాట్ చేసిన ఎంపిపి, జడ్పీటీసీ, సర్పంచులు

ఉపాధి హామీ పనుల విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య సెగలు రేగుతున్నాయి. ఈ చట్టంలో ఉన్న మార్గదర్శకాలకు అనుగుణంగా పంచాయతీ సర్పంచుల ద్వారా పనులు జరగాలని వైసిపికి చెందిన ఎంపిపి, జెడ్పీటీసీ, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపిపి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మెజారిటీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు ఉపాధి హామీ చట్టం ప్రస్తావనకు వచ్చినప్పుడు గళమెత్తారు. గ్రామసభలు నిర్వహించి, పనులు ఆమోదించారని, ఇప్పుడు అవే పనులు కాంట్రాక్టర్లతో చేయించడం సబబు కాదని అన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులకు టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన గౌరవం ఇదేనా అని నిలదీశారు. వైసిపి సభ్యులు మాట్లాడుతున్నంత సేపు ఎమ్మెల్యే బి.విజయచంద్ర మౌనం దాల్చారు. ఇంతలో సమావేశంలోకి సభ్యులు కాని కొంతమంది టిడిపి నాయకులు ప్రవేశించి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఎంపిపి, జెడ్పీటీసీలను కించపరుస్తూ మాట్లాడారు. ఇది భరించలేని సర్పంచులు ఎంపిటిసి సభ్యులు ఎంపిపి, జెడ్పీటీసీలు సమావేశం బహిష్కరించారు. ఎమ్మెల్యే విజయచంద్ర సమక్షంలోనే టిడిపి నాయకులు అవమానిస్తున్నా ఆయన కనీసం ఖండించలేదని బహిష్కరించిన సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యులంతా సమావేశాన్ని బహిష్కరిస్తే ఎమ్మెల్యే అధికారులతో ఎలా సమావేశాన్ని నిర్వహిస్తారని ప్రశ్నించారు.

సర్పంచుల ద్వారా చేయాలని రూల్ లేదు: ఎమ్మెల్యే

ఉపాధి హామీ పనులు పంచాయతీ సర్పంచ్‌ల ద్వారా చేయాలనే నిబంధన ఎక్కడా లేదనీ ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. అందరూ కలిసి చేసుకుంటే అభ్యంతరం లేదని చెప్పారు.

బాయ్ కట్ చేసిన ఎంపిపి, జెడ్‌పిటిసి, సర్పంచులు

సర్వసభ్య సమావేశం అంటే గతంలో మూడు నెలలలో జరిగిన అభివృద్ధి, మిగతా మూడు నెలల్లో జరగబోయే అభివృద్ధి గురించి చర్చించడం, సంబంధిత అధికారులు ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు ఆయా సమస్యలపై అడగడం జరగాలి. కానీ బలిజిపేట మండలంలో దీనికి విరుద్ధంగా సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగిందని ఎంపిపి జి.నాగమణి, జెడ్‌పిటిసి సభ్యులు

సభ్యులెవరూ లేకుండా ఎమ్మెల్యే సమక్షంలో జరుగుతున్న మండల సమావేశం

ఎ.రవికుమార్ అన్నారు. ఈ మేరకు విలేకరులతో వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంపై చర్చ జరుగుతుండగా కొంతమంది ఇతర వ్యక్తులు సర్వసభ్య సమావేశంలోనికి చొరబడి రౌడీల్లా ప్రవర్తించారని అన్నారు. ఎంపిపి, జెడ్‌పిటిసి మాటకు విలువ లేకుండా నచ్చినట్లు సర్వసభ్య సమావేశం జరగకుండా చేశారని తెలిపారు. జరుగుతున్న సన్నివేశాన్ని ఎమ్మెల్యే, అధికారులు చూస్తున్నప్పటికీ వారిని పంపించడంలో గానీ, వారికి సద్ది చెప్పడంలోని ఎటువంటి ప్రయత్నం చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సమావేశం నుంచి మాతో పాటు ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు బాయ్‌కట్ చేశామన్నారు. అనంతరం ఎంపిపి అధ్యక్షతన లేకుండా ఎమ్మెల్యే, మండల అధికారులు సమావేశం నిర్వహించారన్నారు. ఎన్నడూ లేని విధంగా అధికారులు ముందు ప్రజాప్రతినిధులను అగౌరపరచడం దుర్మార్గమన్నారు. ఇటువంటి రౌడీ రాజకీయాలకు స్వస్తి పలకాలన్నారు.

నవంబరు నుంచి హాస్టళ్లలో రాత్రి బస

ప్రజాశక్తి - పార్వతీపురం

నవంబరు నుంచి వసతి గృహాల్లో ప్రత్యేక అధికారులు రాత్రి బస చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి బస చేసి శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి గ్రామంలో పర్యటించాలని స్పష్టం చేశారు. తమ పర్యటనలో బహిరంగ మలవిసర్జన జరగకుండా అవగాహన కల్పించాలని, తాగు నీరు పరిస్థితి, తక్కువ బరువు గల పిల్లల వివరాలు, బడి బయట పిల్లల వివరాలు, గృహ నిర్మాణాలు పరిశీలించాలని ఆయన అన్నారు. మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులతో కలెక్టరేట్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహ నిర్మాణ లే అవుట్ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఎడ్ల బల్లు, ట్రాక్టర్లలో ఇసుక తీసుకెళ్లొచ్చన్నారు. జెసిబి తో తవ్వరాదని స్పష్టం చేశారు. నిర్మాణాలు, తాగు నీటి పథకాలు ఉన్న ప్రాంతాల్లో ఐదు వందల మీటర్ల పరిధిలో తవ్వకాలు జరపరాదని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలు, సేవలను పక్కాగా గుర్తించి విభజించాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపిడిఒలు ప్రజలకు పిజిఆర్‌ఎస్‌పై స్పష్టంగా వివరించాలని అన్నారు. ఉపాధి హామీ చట్టంలో రాష్ట్రంలో ప్రథమ స్థానం దక్కేందుకు కృషి చేసిన అధికారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. మై స్కూల్ మై ఫ్రెండ్‌లో సంబంధిత ప్రత్యేక అధికారులు విధిగా తనిఖీ చేయాలన్నారు. నవంబరు 9 నుండి ఫిబ్రవరి 8 వరకు డైలీ ఆన్‌లైన్ టెస్టులు నిర్వహించడం జరుగుతోందని, వీటిని పర్యవేక్షించాలని అన్నారు. ఈ ఏడాది కూడా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడానికి కృషి చేయాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ జి.కేశవ నాయుడు, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, ఎస్.యశ్వంత్ కుమార్ రెడ్డి, ఇపిడిసిఎల్ ఎస్ఇ కె.చలపతిరావు, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బదిలీ అయిన పీడీని రిలీవ్ చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

రెండు నెలల క్రితమే బదిలీ అయిన డ్వామా పీడీ కె.రామచంద్రరావును వెంటనే రిలీవ్ చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ బదిలీ ప్రక్రియలో భాగంగా జిల్లా అధికారులను బదిలీ చేసినప్పుడు రిలీవ్ చేయకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. వెంటనే ఆయన బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

ఇవిఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న ఇవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా మంగళవారం పట్టణ శివారులో ఉన్న మార్కెట్ యార్డ్‌లో ఉన్న గోదాములను సందర్శించి అక్కడ పరిస్థితిని గమనించారు. గోదాములకు సీల్ వేయబడిన తాళాలు, వెలుపల ఉన్న సీసీ కెమెరాల పనితీరును గమనించారు. ఈ నేపథ్యంలో భద్రతా సిబ్బందికి, అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. భద్రతా ప్రమాణాలు పాటించాలని, పటిష్ట చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట డిఆర్‌ఒ జి.కేశవనాయుడు, ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నైపుణ్య గణనపై జిల్లా స్థాయి శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమావేశ మందిరంలో ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామ/వార్డు సచివాలయం సిబ్బందికి నైపుణ్య గణన 2024 జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని ఆశాఖ జిల్లా అధికారి కె.సాయికృష్ణ చైతన్య, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి వహీదా, తాడేపల్లి నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయం నుంచి కార్తీక నాయక్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయికృష్ణ చైతన్య మాట్లాడుతూ నైపుణ్య గణనాభివృద్ధి ద్వారా యువత అభివృద్ధికి బాటలు వేద్దామన్నారు. రాగల మార్పులకు అనుగుణంగా యువత నైపుణ్యాలను పొంది ఉన్నత స్థానాలను పొందాలన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, నైపుణ్యాభివృద్ధి సిబ్బంది మరియు ఎంప్లాయిమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

పిఎం స్వనిధి అవార్డు స్వీకరించిన కమిషనర్

ప్రజాశక్తి - సాలూరు

ప్రధానమంత్రి స్వనిధి అవార్డును మంగళవారం మున్సిపల్ కమిషనర్ వి.హెచ్.సత్యనారాయణ స్వీకరించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ చేతులు మీదుగా కమిషనర్ సత్యనారాయణ అవార్డు అందుకున్నారు. పట్టణంలో పిఎం స్వనిధి కింద స్వయం ఉపాధి కల్పన కోసం డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరు చేయడంలో మెప్మా సాధించిన ఘనతకు అవార్డు లభించింది.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం

మాదక ద్రవ్యాల నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. హాస్టళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. వసతి గృహాలు , పాఠశాలల్లో విద్యార్థుల పర్యవేక్షణ పక్కాగా ఉండి మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. సరిహద్దు ప్రాంతంలోను, రవాణా లోను గట్టి నిఘా ఉండాలని ఆయన చెప్పారు. ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణపై గట్టి చర్యలు చేపట్టామన్నారు. ఆసుపత్రుల్లో భద్రతా కమిటీలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం బోర్డులు ఏర్పాటు చేయాలని, రెసిడెంట్ డాక్టర్లు, నైట్ డ్యూటీ డాక్టర్ ల భద్రత చర్యలు తీసుకోవాలని అందుకు సెక్యూరిటీ రూం ఏర్పాటు చేయాలని ఆయన వైద్య ఆరోగ్యశాఖ ను సూచించారు. ఎఎస్‌పి డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్ మాట్లాడుతూ గంజాయి రవాణా చేస్తున్న వారిపై ఐదు కేసులు నమోదు చేసి, ఐదు వాహనాలను సీజ్ చేశామన్నారు. 2024లో 28 కేసులు నమోదయ్యాయని, 56 మందిని అరెస్టు చేశామని వివరించారు. పి.కోనవలస, ఇతర ప్రాంతాల్లో డ్రోన్, స్నిఫర్ డాగ్ తో ప్రయోగాత్మకంగా తనిఖీలు నిర్వహించామని అన్నారు. సమావేశంలో డిఎఫ్‌ఒ జిపి ప్రసూన, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజలపై భారాలు వేయడమే సంపద సృష్టా? : రాజన్నదొర

సాలూరు : ప్రజలపై భారాలు వేయడం సంపద సృష్టి అవుతుందా అని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ప్రశ్నించారు. మంగళవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు టిడిపి కూటమి ఇచ్చిన హామీలేమిటి, ఇప్పుడు చేస్తున్న కార్యక్రమాలేమిటన్నారు. అధికారంలోకి వస్తే ప్రజలపై ఎలాంటి భారాలు వేయబోమని చెప్పిన చంద్రబాబునాయుడు ఇప్పుడు విద్యుత్ చార్జీలు ఎందుకు పెంచుతున్నారని ప్రశ్నించారు. ప్రజలపై రూ.6వేల కోట్లు ఛార్జీల భారం ఎలా మోపుతున్నారని ప్రశ్నించారు. అధికారంలో లేనప్పుడు టిడిపి ఒక మాట చెపుతుందని, అధికారంలో ఉన్నప్పుడు మరో మాట చెపుతుందని రుజువైందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే రూ.6వేల కోట్లు విద్యుత్ ఛార్జీల భారం మోపడానికి టిడిపి కూటమి ప్రభుత్వం సిద్ధమైందని చెప్పారు. ప్రతిపక్షంలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించిన సిఎం చంద్రబాబు నాయుడు ఇప్పుడెలా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని ప్రశ్నించారు. అబద్ధాల హామీ లిచ్చి అధికారంలోకి రావడం టిడిపికి అలవాటు గా మారిందని, ప్రజలు ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకోవాలని రాజన్నదొర కోరారు.

అతీగతీ లేని డిఎస్‌సి ఉచిత కోచింగ్

ప్రజాశక్తి - పార్వతీపురం

- గడువులు పెంచుకుంటూ కాలయాపన
- ఇంఛార్జి అధికారుల వలనే అస్పష్టత
- అయోమయంలో గిరిజన అభ్యర్థులు

ఐటిడిఎ ద్వారా డిఎస్సీ ఉచిత కోచింగ్ పై అతీగతీ లేదు. అదిగో, ఇదిగో అంటూ గిరిజన సంక్షేమ అధికారులు ప్రకటనలివ్వడమే తప్ప ఎప్పటి నుంచి ఉచిత కోచింగ్ ప్రారంభిస్తారో స్పష్టత లేదు. ఉచిత కోచింగ్ పొందడానికి ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి నెలలు గడిచిపోయాయి. ఇప్పటికే ప్రయివేటు కోచింగ్ సెంటర్లు డిఎస్సీ అభ్యర్థులకు కోచింగ్‌ను ప్రారంభించాయి. వేలాది రూపాయల కోచింగ్ ఫీజులు చెల్లించలేని గిరిజన అభ్యర్థులు ఉచిత డిఎస్సీ కోచింగ్ కోసం గత కొద్ది నెలలుగా ఎదురుచూస్తున్నారు. గిరిజన సంక్షేమ అధికారుల్లో స్పష్టత లేకపోవడంతో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో అయోమయం నెలకొంది. అటు డబ్బులు చెల్లించి ప్రయివేటు కోచింగ్ సెంటర్లకు వెళ్ళలేక ఇటు ఐటిడిఎ ఉచిత కోచింగ్ పొందలేక వారు సతమతమవుతున్నారు. అప్పో సప్పో చేసి ప్రయివేటు కోచింగ్ సెంటర్లకు వెళ్దామంటే ఐటిడిఎ ద్వారా ఉచిత కోచింగ్ అంటూ ఊరిస్తున్నారని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలుత పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురంలో ఉచిత డిఎస్సీ కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా నిర్వహిస్తామని చెప్పడంతో గందరగోళం నెలకొంది.

3న ఫ్రీ కోచింగ్ కోసం స్క్రీనింగ్ పరీక్ష

డిఎస్సీ ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీలకు వచ్చేనెల 3న ఆన్ లైన్ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తాం. ఇంతవరకు ఉమ్మడి జిల్లాలో 870 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి విజయనగరం, శ్రీకాకుళంలో స్క్రీనింగ్ పరీక్ష వుంటుంది. దరఖాస్తుదారులు ఆ రెండు కేంద్రాల్లో పరీక్షకు హాజరు కావొచ్చు. ఆ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారిని 200 మందిని ఎంపిక చేయనున్నాం. వీరికి విశాఖపట్నం లో ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత కోచింగ్ ఇవ్వనున్నాం.

గయాజుద్దీన్
గిరిజన సంక్షేమ డిడి

ఇంఛార్జి అధికారుల వల్లనే

ఐటిడిఎ పిఒ, గిరిజన సంక్షేమ డిడి, కార్యాలయం సూపరింటెండెంట్ వంటి కీలక పోస్టుల్లో గత కొంతకాలంగా ఇన్‌ఛార్జి అధికారులు కొనసాగుతుండడం వల్లనే ఉచిత డిఎస్సీ కోచింగ్ నిర్వహణపై స్పష్టత లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవ్ గత కొద్ది రోజులుగా ఇంఛార్జి ఐటిడిఎ పిఒగా వ్యవహరిస్తున్నారు. అటు రెవెన్యూ వ్యవహారాలు, ఇటు ఐటిడిఎ కార్యకలాపాలపై దృష్టి సారిస్తుండడంతో కొన్ని కీలకమైన అంశాలు పక్కదారి పడుతున్నాయి. నెలరోజుల క్రితం వరకు గిరిజన సంక్షేమ డిడిని సరెండర్ చేయడంతో సాంఘిక సంక్షేమ డిడికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనకు గిరిజన సంక్షేమ శాఖ వ్యవహారా పై అవగాహన లేదు. కార్యాలయం సూపరింటెండెంట్‌ను కూడా పాడేరుకి డెప్యుటేషన్ పై బదిలీ చేయడం తో ఐటిడిఎ ప్రాజెక్టు పరిధిలో కీలకమైన వ్యవహారాలు మందకొడిగా ముందుకెళు _న్నాయి. దీని వల్ల గిరిజన నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు గురవుతున్నారు. కీలకమైన ఉచిత డిఎస్సీ కోచింగ్ నిర్వహణపై స్పష్టత లేని పరిస్థితి ఏర్పడింది.

స్పష్టత ఇవ్వాలి

గిరిజన అభ్యర్థులకు ఉచిత డిఎస్సీ కోచింగ్ ఎప్పుడు ప్రారంభిస్తారో ఐటిడిఎ అధికారులు స్పష్టత ఇవ్వాలి. గడువులు పెంచుకుంటూ కాలయాపన చేయడం ద్వారా అభ్యర్థుల్లో గందరగోళం ఏర్పడింది. ఉచిత కోచింగ్ కోసం ఎదురుచూస్తున్న డిఎస్సీ అభ్యర్థులు నిరాశ చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పష్టత ఇవ్వాలి.

పి.రంజిత్ కుమార్, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

నేర నియంత్రణే పోలీసుల లక్ష్యం : ఎస్‌పి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో నేర నియంత్రణే లక్ష్యంగా పోలీసులు పనిచేయాలని ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్సు హాల్‌లో నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షించారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా సిసిటిఎన్‌ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని తెలిపారు. సైబరు మోసాలు జరగకుండా చూడాలని, వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డుపై గుంతలు వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని కావున వాటిని పూడ్చి ప్రమాదాలు నివారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మానవ అక్రమరవాణ, వెట్టిచాకిరి రద్దు చట్టాలపై మీద న్యాయవాది ఎం.మణి, (అడ్వకేట్), ఐఆర్‌ఎడి అప్లికేషన్‌పై జి.శ్రీధర్ అధికారులకు అవగాహన కల్పించారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పాచిపెంట

మండల కేంద్రమైన పాచిపెంటలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పండు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ విద్యార్థులు ర్యాలీగా వెళ్లి తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా పండు మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలపై ఈనెల 27 నుంచి 30 వరకు అన్ని మండలాల్లో ధర్నాలు, నవంబర్ 2 నుంచి 4 తేదీ వరకు కలెక్టరేట్ వద్ద దీక్షలు, 6న చలో కలెక్టరేట్ పిలుపుని ఇచ్చామన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని, డిగ్రీలో మేజర్ మైనర్ ఆన్సర్ విధానాన్ని రద్దు చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, పార్వతీపురం మన్యం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఖాళీగా ఉన్న సంక్షేమ హాస్టల్లో వార్డెన్లు, వర్కర్లను వెంటనే నియమించాలని, పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు రూ.3వేలకు పెంచాలని, బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం, పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ అమలుపై స్పష్టత ఇవ్వాలన్నారు. ఎస్సీ, బిసి పోస్టుమెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు, గిరిజన పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో అదనపు భవనాల నిర్మించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ జి.సింహాద్రి జి.సంజీవ్, రంజిత్, రమేష్, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పాచిపెంటలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కొమరాడ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్ఐ నాయకులు డేవిడ్ డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని జూనియర్ కాలేజీలో నుంచి రెవెన్యూ కార్యాలయం వద్ద ర్యాలీగా వెళ్లి సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు కె.ఉదయ్, ఎస్.కౌశిక్, కె.దినేష్, కె.విజయ్, వినయ్, దుర్గాప్రసాద్, అఖిల్, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయాలని , డిగ్రీ కాలేజ్ సొంత భవనం ఏర్పాటు చేయాలని వ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో ధర్నా. తొలుత విద్యార్థులతో కలిసి స్థానిక జూనియర్ కాలేజ్ నుండి రెవెన్యూకార్యాలయం వరకూ భారీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫై జిల్లాకమిటీ సభ్యుడు హెచ్.సింహాచలం మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సురేష్, మండల నాయకులు, రాజు, బాలు, దిలీప్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల హెల్త్ చెకప్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పోలీసు సంస్మరణ వారోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ఎమ్మెల్యే బి.విజయచంద్ర సౌజన్యంతో ఏర్పాటు చేసిన మాస్టర్ హెల్త్ చెకప్‌కు మంచి స్పందన లభించింది. ఈ హెల్త్ చెకప్‌లో 300 మందికి పైగా పోలీసులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరికి ఎమ్మెల్యే సొంత ఖర్చులతో అవసరమైన మందులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో పోలీసుల పాత్ర గుర్తించి వారి ఆరోగ్యాన్ని గురించి ఆలోచన చేసి పలు విభాగానికి చెందిన వైద్యులు, ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్టు తెలిపారు. రెండురోజుల పాటు జరిగిన ఈ శిబిరంలో 500మంది పోలీసులు వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. జిల్లా ఏర్పాటయ్యాక గతంలో ఎవరూ చేయని ఆలోచన ఎమ్మెల్యే విజయ్ చంద్ర చేసి వందలాదిమంది పోలీసులకు ఆరోగ్య తనిఖీలు చేయించడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం చేశారు.

పోలీసుల ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

గుండెపోటుతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని దత్తివలసలో అంగన్వాడీకార్యకర్తగా పనిచేస్తున్న బొమ్మి బంగారమ్మ(50) మంగళవారం కేంద్రంలో విధులు నిర్వహిస్తుండగా హఠాత్తుగా గుండెపోటు రావడంతో మతి చెందారు. ఆమెకు కుమారుడు, కుమార్తె. ఈమె భర్త సాలూరు మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయు నిగా పనిచేస్తున్నారు. మృతి చెందిన బంగారమ్మ కుటుంబాన్ని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్‌వై నాయుడు, ప్రాజెక్టు అధ్యక్షులు శశికళ, గౌరీశ్వరి పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు ప్రకారం విధుల్లో ఉండి చనిపోతే దహన సంస్కార ఖర్చులు రూ.20వేలు ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని అధికారులను కోరారు. దీనికి సంబంధించిన జీవోలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

స్వర్ణోత్సవ సభలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ సభ గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గెడ్డలుప్పి ప్రాథమికోన్నత పాఠశాలలో ఈనెల 3న పార్వతీపురంలో జరగనున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ సభ గోడ పత్రికను యుటిఎఫ్ మండల శాఖ మంగళవారం ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి బొత్స ప్రసాదరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా స్వర్ణోత్సవ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు పల్లి శ్రీనివాసరావు, సహాధ్యక్షులు అంది పోలినాయుడు, కార్యవర్గ సభ్యులు కె.మురళి, బి.కొండలరావు, ఎ.శంకరరావు, జి.దాలయ్య, డి.ఈశ్వరరావుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నవంబర్ 3 4 తేదీల్లో జరగనున్న యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు. మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు బి.దుర్గాప్రసాద్, కె.గోవిందరావు, గౌరవాధ్యక్షులు ఎ. స్వామి బాబు, రాజేశ్వరి, విశాలాక్షి, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ అలవెన్స్‌లు చెల్లించాలి

ప్రజాశక్తి - కురుపాం

ఏజెన్సీలోని రెవెన్యూ గ్రామాలకే కాకుండా అన్ని పాఠశాలలకు ఎస్‌సిఎ, ఎహెచ్‌ఆర్‌ఎ అలవెన్స్‌లు చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని జి.శివడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవాలు పిలుపు మేరకు మంగళవారం వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరి శిఖర గ్రామాల్లో గల పలు పాఠశాలలకు ఏజెన్సీ అలవెన్సులు అందడంలేదని ఉపాధ్యాయులు తెలిపారన్నారు. కేవలం రెవెన్యూ గ్రామాల్లో మాత్రమే ఏజెన్సీ అలవెన్స్‌లు ఇచ్చి గిరి శిఖర గ్రామాల పాఠశాలలకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కావున తక్షణమే ప్రభుత్వం స్పందించి అన్ని పాఠశాలలకు ఏజెన్సీ అలవెన్సులు ఇచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు బి.కరువులు, చలపతిరావు, రవి, తదితరులు పాల్గొన్నారు.



పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

సమగ్ర పశు గణన సర్వే చేపట్టాలి

ప్రజాశక్తి - కురుపాం

సమగ్రమైన పశుగణన సర్వే చేపట్టేలా వెటర్నరీ వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి అన్నారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురం మండలంలో గల తన అతిథి గృహంలో పశు గణన సర్వే గోడపత్రికలను విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఐదేళ్లకొకసారి చేపట్టే ఈ సర్వే ప్రతి గ్రామంలో పెంపుడు జంతువుల సమగ్ర సమాచారం తీసుకొనేలా చర్యలు చేపడితే పశు సంవర్ధక శాఖకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. దీని ద్వారా రైతులకు ఇవ్వాల్సిన రుణాల రాయితీలు సక్రమంగా ప్రభుత్వం అందించేందుకు దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ వైద్య అధికారులు కె . శైలజ, పి. లక్ష్మణరావు సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షులను కలిసిన లావణ్య

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి అధ్యక్షుడికి బొకేను అందజేస్తున్న లావణ్య

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును రాష్ట్ర ట్రైకార్ సభ్యులు పువ్వల లావణ్య మంగళవారం విశాఖపట్నంలో తన అతిథిగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు దానికి సంబంధించిన పరిష్కార మార్గాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారని, అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో పోలిస్తే గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్ని విషయాల్లో అండగా ఉంటుందని హామీ ఇచ్చారన్నారు. ఈమెతో పాటు నియోజకవర్గంలో గల కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

దోపిడీని అంతం చేద్దాం

ప్రజాశక్తి - మక్కువ

గిరిజనులపై జరుగుతున్న దోపిడీ, పీడనలు అంతమవ్వాలని ఏపీ రైతు కూలీ సంఘం కార్యదర్శి డి వర్మ అన్నారు. మంగళవారం దున్నేవాడికే భూమి అనే నినాదంతో జరిగిన శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటంలో భూస్వాముల దొంగ కాల్పుల్లో మరణించిన తొలి అమరులుకోరన్న, మంగన్నలకు నివాళ్లు అర్పించారు అనంతరం మార్కొండపుట్టి ఏరియా తెలగడవలసలో రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు అధ్యక్షతన సభ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి.ఆసిరి, ఎం.ప్రసాద్, కె.చిన్నప్ప, గిరిజనులు పాల్గొన్నారు.

మ్యూజియంను ఎందుకు పూర్తి చేయలేదు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక పిఎంఆర్‌సి వద్ద గిరిజన మ్యూజియం నిర్మాణం 2017లో పనులు ప్రారంభించిన అధికారులు నేటికీ ఎందుకు పూర్తి చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆదివాసీ గిరిజన సంఘం సీనియర్ నాయకులు బి.అప్పారావు, పి.సాంబయ్య ప్రశ్నించారు. 8ఏళ్లుగా దీనికి ఎంత ఖర్చు పెట్టారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొంతమంది అధికారులను కేటాంచి లక్షలు రూపాయలు ఖర్చు పెట్టి ఇతర ప్రాంతాలకు వెళ్లి సేకరించిన వస్తువులు దొంగలు దోసుకు పోతుంటే ఐటిడిఎ యంత్రాంగం ఏం చేస్తుందన్నారు. పర్యాటకశాఖా మంత్రి ఈ విషయంపై జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన రైతాంగ పోరాటానికి పురిటిగెడ్డ అయిన సీతంపేటలో ప్రముఖుల విగ్రహాలు, గిరిజన సంప్రదాయం వస్తువులతో వెంటనే మ్యూజియం నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి - కురుపాం

వైద్యాధికారులతో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ విజయపార్వతి

రోగులకు మెరుగైన వసతులతో వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి విజయపార్వతి అన్నారు. మండలంలోని నీలకంఠాపురం, మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలు, సమస్యలు ఎలా ఉన్నాయా అని రోగులతో మాట్లాడి ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రిలో మందుల రికార్డులు, ఇతర రికార్డులు పరిశీలించారు. ఏజెన్సీలో జ్వరాలు, పారిశుధ్య నిర్వహణ పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యసిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యులు అభినవకుమార్, అమరసింహారెడ్డి, ప్రజ్ఞ, హర్ష, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రోగులను పర్యవేక్షించాలి

సీతానగరం : దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్ష చేయాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. స్థానిక పిహెచ్‌సిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏఏ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వస్తున్నారో ఒపి రికార్డుల్లో తనిఖీ చేసి సీజనల్ వ్యాధులు, దీర్ఘకాలిక రోగాలు, అత్యవసర చికిత్స అవసరమైన వారు, అందజేసిన చికిత్సా వివరాలు పరిశీలించారు. కొత్తగా దీర్ఘకాలిక రోగులను గుర్తిస్తే ప్రత్యేక వారి ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. కుక్కకాటు, పాముకాటు ఇంజక్షన్లు, వ్యాధినిరోధక వ్యాక్సిన్ల లభ్యత నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్‌పై ఆరా తీసి పిహెచ్‌సి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ల్యాబ్,ఇతర వైద్య పరికరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రధాన రహదారికి సమీపాన పిహెచ్‌సి ఉన్నందున అత్యవసర, ప్రథమ చికిత్స మందులు సిద్ధంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ జగన్మోహన్ సిబ్బందితో సమీక్ష జరిపి ఆరోగ్య కార్యక్రమాల అమలు చేస్తున్న తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి.ఉషారాణి, సూపర్వైజర్లు సత్యవతి, జయగౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ఈశ్వరరావు

కోరన్న, మంగన్న వర్ధంతి సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ మామిడిమానుగూడలో ఈనెల 31న జరనున్న 57వ కోరన్న, మంగన్న వర్ధంతి సభలకు గిరిజన ప్రజలు, యువత, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయన సిపిఎం నాయకులు బి.వెంకటరావుతో కలిసి మహాసభ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోరన్న, మంగన్నలు గిరిజనుల హక్కుల కోసం, ప్రత్యేక చట్టాల కోసం పోరాడి అమరులయ్యారని, వారి పోరాటాల ఫలితంగా గిరిజనుల హక్కులు, చట్టాలు సాధించుకున్నామని అన్నారు. ఇప్పుడు అనుభవిస్తున్న 1/70, పీసా చట్టం 2005లో వచ్చిన అటవీ హక్కుల చట్టం, ఉద్యోగ రిజర్వేషన్లు ఇలా గిరిజన చట్టాలు చాలానే సాధించుకున్నామని అన్నారు. అయితే బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ చట్టాలను కాలగర్భంలో కలిపే ప్రయత్నాలు చేస్తున్నాయని అన్నారు. అలా జరిగితే మన తరం, భవిష్యత్తు తరలపై ప్రభావం చూపుతుందన్నారు. కావున అమరవీరుల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని మనం సాధించుకున్న చట్టాలను కాపాడుకునే దిశగా ప్రతి గిరిజనడు పోరాటాలకు సిద్ధమవ్వాలని, సాధించిన చట్టాల జోలికి వస్తే గిరిజన యువత చూస్తూ ఊరుకోమని పిడికిలి ఎత్తి పోరాటాల దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సిపిఎం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెద్దూరు పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ దిబ్బ సూర్యచంద్రరావు సందర్శించారు. మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. బాగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. 3,4,5 తరగతుల విద్యార్థుల నోట్ పుస్తకాలు పరిశీలించారు. విద్యార్థులకు ఎంఇఒ వేసిన ప్రశ్నలకు విద్యార్థులు సమాధానం ఇవ్వడంతో సంతృప్తి చెందార. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య గురించి అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయన్నారు. విద్యార్థులు ఇప్పటి నుంచే బాగా చదువుకుంటే ఉన్నత శిఖరాలకు అధిరోహించ వచ్చునన్నారు. ఆయన వెంట రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు నెల్లి సత్యం నాయుడు, హెచ్ఎం ప్రసాద్ తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - పాలకొండ

మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ప్రధానోపాధ్యాయులు మీసాలు సూర్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు అలవాటైతే అనారోగ్యానికి గురవుతారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంత్, బౌరోతు శంకరరావు, నారాయణరావు ఉన్నారు.

సిసిఆర్‌సి కార్డుదారులు రుణాలకు అర్హులు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరంలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సిసిఆర్‌సి కార్డ్ తీసుకున్న ప్రతి కౌలు రైతు బ్యాంకుల్లో రుణం పొందేందుకు అర్హులేనని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ తెలిపారు. మండలంలోని ఆర్.వెంకంపేటలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసిఆర్‌సి చట్టం ద్వారా యజమాని భూమికి ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా కౌలు రైతులు 2024 చట్టం రూపొందించబడుతుందని, కావున నేరుగా బ్యాంకుకు వెళ్లి తాము పండించిన పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణం తీసుకోవచ్చని అన్నారు. అలాగే రైతులు రాబోయే రబీలో నవధాన్య సాగు అలవాటు చేసుకోవాలన్నారు. దీనివల్ల భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుతుందని, నేలలో సారం పెరిగి పంట దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, గ్రామపెద్దలు, రైతులు, వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పాచిపెంట : రైతులు పొటాష్ ఎరువులు వినియోగించడం లేదని, ఇది పంటల్లో చీడ, పీడలు తట్టుకోవడానికి మాత్రమే కాకుండా నాణ్యతకు సంబంధించిన గుణాలను పెంచుతుందని ఎఒ కె.తిరుపతిరావు తెలిపారు. ఈ పంటల దిగుబడి బరువును పెంచడమే కాకుండా ఇతర మూలకాల పంటకు అందేలా చేస్తుందన్నారు. కావున రైతులు ఏ పంటకైనా దుక్కిలో ఒకసారి, పొట్ట పూత దశలో ఒకసారి తప్పనిసరిగా పొటాష్ వేసుకోవాలన్నారు. అనంతరం ఆజూరులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరరావు, విఎఎ నాగమణి, పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ శంకర్రావు, ప్రకృతి సేద్యం ఎల్ టు విజయ్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలని జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు, నాయకులు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. మండలంలోని మర్రి పాడు పంచాయతీలోని ఎగువదార బంధంలో గిరిజన సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నడిమి దారబంధం, దిగువ దారబంధం, రంగం వలస, పెద్ద గూడ, మూలగూడ, గుడిగుడ్డ, ఉసిరికి పాడు, ఎకువ దారబంధంగిరిజన గ్రామాలకు రహదారులు, తాగు నీరు, స్కూల్ భవనం, పక్కా గృహాల్లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్ని వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకొనే నాథుడే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. నెలరోజుల్లో అధికారులు ఈ సమస్యలు పరిష్కరించాలని, లేనిచో ఐటిడిఎ వద్ద ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు బి.సాయి, పి.వీరన్న, ఎ.భాస్కర్ రావు. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పనిచేస్తున్న ఉపాధ్యాయుడు భాస్కరరావును మంగళవారం నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు సమక్షంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్న భాస్కరరావును సన్మానించడం అభినందనీయమని అన్నారు. ఇటువంటి ఉపాధ్యాయులు పాఠశాలలో ఉత్తమ సేవలందించి విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడ్ని సన్మానిస్తున్న గ్రంథాలయ సంస్థ నిర్వాహకులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని ప్రజారోగ్య విభాగంలో ఇటీవల ఆప్కాస్ విధానంలో కొత్తగా నియమించిన 11 మంది పారిశుధ్య కార్మికులకు పని భారం ఎక్కువవుతుందని, వారికి ఆదివారం సెలవు ఇవ్వాలని, సిఎల్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్నజనవరి నెల జీతం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు మంగళవారం సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణతో కలిసి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో ప్రజారోగ్య అధికారి కె.ఫకీరురాజుకు వినతి పత్రాన్ని అందజేశారు.

ఘనంగా ఆయుర్వేద దినోత్సవం

ప్రజాశక్తి - సీతానగరం

జాతీయ ఆయుర్వేద దినోత్సవం (ధన త్రయోదశి - ధన్వంతరి జయంతి) బూర్జ ఆయుర్వేదిక్ ఆయుష్మన్ ఆరోగ్య మందిర్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ టి.హేమక్షి మాట్లాడుతూ మొట్ట మొదటి భారతీయ వైద్యం ఆయుర్వేదం ఆవిర్భావానికి మూల కారకులైన ధన్వంతరి ఆవిర్భావం గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఇఒ జి.సూరిదేముడు ఆధ్వర్యంలో ఔషధ మొక్కలు వాటి ఉపయోగాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది, యోగ ఇన్స్ట్రక్టర్ లు పాల్గొన్నారు.

శరవేగంగా ఆసుపత్రి పనులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో ఆసుపత్రి బ్లాక్ పనులు సరవేగంగా కొనసాగుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ నిధులతో లక్షలాది రూపాయలు వెచ్చించి రోడ్లు, భవనాల శాఖ పర్యవేక్షణలో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వైద్య సిబ్బంది సమావేశాలు నిర్వహించుకునేందుకు ఉన్న ఆస్పత్రి భవనం ఇరుగ్గా ఉన్నందున అదనపు భవనం నిర్మించాలని సిబ్బంది ఉన్నతాధికారులకు నివేదించడంతో ప్రభుత్వం స్పందించి అదనపు భవన నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయడం పట్ల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణ పనులు పూర్తయితే కొంతమేర సమస్య పరిష్కారమవుతుందని సిబ్బంది చెబుతున్నారు.

డమ్మీ విఆర్‌ఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెద్దింపేట, గౌరీపురం రెవెన్యూ పరిధిలో పనిచేస్తున్న విఆర్‌ఒ కుమారు రాకేష్ డమ్మీ విఆర్‌ఒగా వ్యవహరిస్తున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన తహశీల్దార్ కె.రత్నకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దింపేట, గౌరీపురం రెవెన్యూ పరిధిలో ఉన్న భూములను గత ప్రభుత్వం సర్వే చేసిందని, అందులో భాగంగా తప్పులు ఉన్న భూములు విషయంలో రీసర్వే నిర్వహించేందుకు తూతూ మంత్రంగా గ్రామసభలు నిర్వహించిందన్నారు. పెద్దింపేట రెవెన్యూ పరిధిలో సుమారు 350 ఎకరాల భూమికి 200 మంది రైతుల పేరున డి పట్టా ఉందని, గతంలో జరిగిన రీ సర్వేలో డి- పట్టా భూమిని ఫ్రీహోల్ట్ చేసి జిరాతీగా మారాల్సి ఉందని ఆయన అన్నారు. డమ్మీ విఆర్ఒ వల్ల ఈ మార్పు చేయక పోవడంతో డి-పట్టాగానే ప్రస్తుతం ఆన్లైన్‌లో చూపిస్తుందని అన్నారు. ఈ విషయంపై నిర్లక్ష్యంగా ఉన్న విఆర్వోపైనా, డమ్మీ విఆర్ఒపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మంచి దుర్గాప్రసాద్, అలజింగి రాము, వెన్నెల తిరణాల తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన జరుగు ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు.

ప్రధానరహదారిపై ఏర్పడ్డ భారీ గొయ్యిలు

రహదారి అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపం

అధికారుల నుంచి రికవరీ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించిందని, ప్రధాన రహదారికి వెచ్చించిన నిధులను అధికారుల నుంచి రికవరీ చేయాలని సిపిఎం జిల్లా నాయకులు ఎం.తిరుపతిరావు, కె.గంగునాయుడు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పనులు జరిగినప్పుడు అధికారుల పర్యవేక్షణ కొరవడంతో గుత్తేదారుడి ఇష్టానుసారంగా పనులు చేపట్టడం వల్ల కలకాలం ఉండాల్సిన ప్రధాన రహదారి ఎక్కడికక్కడే గుంతలు గుంతలుగా ఏర్పడడంతో ద్విచక్ర వాహనదారులు, వాహనదారులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారన్నారు. 2021లో ప్రారంభమైన రోడ్డు పనులు నేటికీ పూర్తి కాలేదని వారన్నారు. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి చేయటంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. అధికారుల పర్యవేక్షణ పనుల్లో నాణ్యత లోపించిందన్నారు. అంబేద్కర్ జంక్షన్ వద్ద గల పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారుల ప్రమాదాలకు గురికావడంతో పాటు వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని అన్నారు. అంతేకాకుండా ప్రధాన రహదారి విస్తీర్ణంలో గృహాలు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించడంలో అధికారులు విఫలమయ్యారని తెలిపారు. తక్షణమే ప్రధాన రహదారి విస్తీర్ణం అభివృద్ధి పనులు పూర్తి చేసి, ఇళ్లు కోల్పోయిన వారికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆక్రమణ స్థలాన్ని పరిశీలిస్తున్న గిరిజనసంఘం నాయకులు

పేదల స్థలం పెత్తందార్లకు

రెవెన్యూ అధికారుల తీరు హేయం

ఆదివాసీ గిరిజన సంఘం ఆగ్రహం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని పేదల ఇంటి స్థలాలకు రక్షణ లేకుండా పోయిందని, స్వయాన రెవెన్యూ అధికారులు పెద్దలకు అప్పగించాలని చూడడం హేయమైన చర్య అని ఆదివాసీ గిరిజన సంఘం తప్పు పట్టింది. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం నాయకులు తాడంకి ప్రభాకర్ సారాయివలసలో ఆవాల అప్పలస్వామి ఇంటిని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో పొజిషన్‌లో ఉన్న వృద్ధుల ఇంటి స్థలాన్ని పెత్తందారైన అల్లు అన్నపూర్ణమ్మకు అనధికారికంగా అప్పజెప్పడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. 30ఏళ్ల క్రితం ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాల కోసం భూమి కొనుగోలు చేశారని, ఆ భూమిలో ఆవాల అప్పలస్వామి పూరిల్లు కట్టుకొని జీవిస్తున్నారని అన్నారు. 1996లో పొజిషన్ సర్టిఫికేట్ కూడా ఇచ్చారని, ఈ స్థలం వారి అనుభవంలో వుందని పేర్కొన్నారు. ఇదే స్థలాన్ని పెత్తందారైన అన్నపూర్ణమ్మకు అప్పచెప్పడానికి తహశీల్దార్ పోలీసులతో అప్పలస్వామి కుటుంబ సభ్యులపై దౌర్జన్యం చేయడానికి ప్రయత్నించారని అన్నారు. అన్నపూర్ణమ్మ ఇప్పటికే 3సెంట్లు ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టుకున్నారని, అంతకుముందు ఆమె కుటుంబానికి గ్రామంలో పెంకుటిల్లు ఉందని అటువంటి వారికి మళ్లీ ఇంటి స్థలం అప్పజెప్పడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు అప్పలస్వామి స్థలం ఆయనకే ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు.

జాబ్ మేళాకు స్పందన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ జయమణి ఆధ్వర్యంలో మంగళవారం జవహార్ నాలెడ్జ్ కేంద్రం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాకు 93మంది హాజరు కాగా 21మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ యువతకి ఉపాధి కల్పించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్ మెంట్ అధికారి మనోజ్ కుమార్, జెకెసి సమన్వయకర్త పి.రాజ్యలక్ష్మి, కో-ఆర్డినేటర్ బి.రాజు, అధ్యాపకులు ఎం.శాంతి, ఎం.శంకరరావు, శంకరబాబు, గురవయ్య, జమ్మయ్య, సీతారాం, తదితరులు ఉన్నారు.

టెన్త్ విద్యార్థులు ఆదర్శంగా నిలవాలి

ప్రజాశక్తి - సీతంపేట

పదో తరగతి విద్యార్థినిలు ఆదర్శంగా నిలవాలని ఎంపిడిఒ కె.గీతాంజలి అన్నారు. మంగళవారం హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. మై స్కూల్ మై ప్రైడ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలను సందర్శించినట్టు తెలిపారు. టెన్త్ విద్యార్థులు ఆదర్శవంతంగా ఉండడానికి టీమ్స్ కింద ఏర్పాటు చేశారు. ఆదర్శవంతమైన వ్యక్తుల పేర్లు పెట్టి పిల్లలను ఆదర్శంగా ఉండాలని చెప్పారు. పది పరీక్షలు దగ్గర పడుతున్నాయని, ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తీర్ణత తప్పనిసరిగా సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.ఉమావాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ గీతాంజలి